ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం

ప్రాంతీయ వార్తా విభాగం

ప్రాంతీయ వార్తలు

తేది : 02.05.2024 సమయం : 1810 గంటలు

ముఖ్యాంశాలు

1. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలు బిజెపికి ఓటు వేస్తే రిజర్వేషన్ల రద్దు ఖాయమని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మరోసారి ఆరోపించారు.
2. బి.ఆర్.ఎస్ ప్రభుత్వ హయాంలో తనతో పాటు పలువురు ప్రముఖులు ఫోన్ ట్యాపింగ్ బాధితులమని బిజెపి కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ పేర్కొన్నారు.
3. ప్రధానమంత్రి నరేంద్రమోది గనుక మూడవసారి అధికారంలోకి వస్తే దేశంలో ప్రజాస్వామ్యానికి ఇబ్బంది అవుతుందని పౌర సరఫరాలు, సాగునీటి శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆరోపించారు అన్నారు.
4. రాష్ట్రంలో వేడి పరిస్థితులు మరో నాలుగు రోజులు కొనసాగుతాయని వాతావరణ శాఖ తెలిపింది.

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

ప్రజలు రానున్న పార్లమెంటు ఎన్నికల్లో బిజెపికి ఓట్లు వేస్తే రిజర్వేషన్లు పోవడం ఖాయమని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మరోసారి ఆరోపించారు. కొమరం భీమ్ అసిఫాబాద్ జిల్లాలో ఈ మధ్యాహ్నం నిర్వహించిన జన జాతర సభకు మంత్రి సీతక్కతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... బిజెపి రిజర్వేషన్లు తీసి వేస్తుందనడానికి సాక్షాలు ఉన్నాయన్నారు. దేశంలో 2021 సంవత్సరంలో బిజెపి – జనగణన చేయలేదని చెపుతూ, దీనికి కారణం జనగణనతో పాటు కులగణన చేయాలని కాంగ్రెస్ డిమాండ్ చేయడమేనన్నారు. అదే జరిగితే కులాల ప్రాతిపదికన రిజర్వేషన్లు పెంచాల్సి వస్తుందని బిజెపి అభిప్రాయం అన్నారు. తాను ప్రతిపక్షంలో ఉన్నప్పుడు అప్పటి ముఖ్యమంత్రి చంద్రశేఖర్ రావు జైల్లో పెట్టారని ఇప్పుడు ప్రధానమంత్రి నరేంద్రమోది ఆ ప్రయత్నం చేయడానికి యత్నిస్తున్నారని ఆరోపించారు.

పిటిసి అసిఫాబాద్

BANDI

బి.ఆర్.ఎస్ ప్రభుత్వ హయాంలో తాను, బి.ఆర్.ఎస్ సిద్ధిపేట ఎమ్.ఎల్.ఏ హరీష్ రావు, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి – ఫోన్ ట్యాపింగ్ బాధితులమని బిజెపి కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ పేర్కొన్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంగా మాజీ ముఖ్యమంత్రి చంద్రశేఖరరావు, బి.ఆర్.ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కె.తారక రామారావు ఈ ఫోన్ ట్యాపింగ్ కు పాల్పడ్డారని బండి సంజయ్ ఆరోపించారు. నాంపల్లిలోని కార్యాలయంలో విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ సంజయ్... ఈ కేసును కాంగ్రెస్ పార్టీ సి.బి.ఐకి ఎందుకు అప్పగించడంలేదని, ఈ విషయంలో ప్రజలకు ఎందుకు నిజాలు తెలియపర్చడం లేదని ప్రశ్నించారు. గతంలో తన

ఫోన్ ట్యాపింగ్ కు గురి కావడం వల్లనే జీవో 317, టి.ఎస్.పి.ఎస్.సి విషయంలో తనను అరెస్టు చేశారని సంజయ్ గుర్తు చేశారు. ఈ విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం కనుక సిబిఐ విచారణ జరిపించకపోతే ఈ కేసులో కాంగ్రెస్ కు కూడా జోక్యం వుందని ప్రజలు అభిప్రాయపడతారని హెచ్చరించారు.

PTC/HYD

UTTAM

ప్రధానమంత్రి నరేంద్రమోది గనుక మూడవసారి అధికారంలోకి వస్తే దేశంలో ప్రజాస్వామ్యానికి ఇబ్బంది కలుగుతన్నదని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, పౌర సరఫరాలు, సాగునీటి శాఖ మంత్రి కేప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆరోపించారు. నల్గొండ లోక్ సభ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ అభ్యర్ధిగా పోటీ చేస్తున్న రఘువీరారెడ్డికి మద్దుతుగా ఉత్తమ్ కుమార్ రెడ్డి సూర్యాపేట జిల్లాలో పలు వరుస ప్రచార సభల్లో పాల్గొన్నారు. సంగారెడ్డి జిల్లాలో ఇటీవల ప్రధానమంత్రి నరేంద్రమోది చేసిన ప్రసంగాల గురించి ప్రస్తావిస్తూ ఉత్తమ్ కుమార్ రెడ్డి... బిజెపి అధికారంలోకి వస్తే రాజ్యాంగాన్ని మార్చబోదన్న విషయంలో స్పష్టత ఇవ్వలేకపోయిందని అన్నారు. బిజెపి కనుక అధికారంలోకి వస్తే దేశానికి ప్రమాదమేనని, ఆ పార్టీ రిజర్వేషన్లను ఎత్తివేస్తుందని ఆరోపించారు.

PN

పెద్దపల్లి

బీఆర్ఎస్ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి చంద్రశేఖరరావు చేపట్టిన బస్సు యాత్రకు వస్తున్న విశేష ఆదరణ చూసి ఓర్వలేకనే కాంగ్రెస్ పార్టీ కుట్రపూరితంగా ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేసిందని బిఆర్ఎస్ పార్టీ పెద్దపల్లి ఎంపీ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్ అన్నారు. పెద్దపల్లి

జిల్లాలో మీడియా సమావేశంలో మాట్లాడుతూ ఆయన... చంద్రశేఖరరావు చేపట్టిన బస్సు యాత్రను మాత్రమే ఆపగలుగుతారు కానీ, ప్రజల్లో ఆయనపై ఉన్న వ్యతిరేకతను ఎలా ఆపుతారని ప్రశ్నించారు. బస్సు యాత్రను అడ్డుకోవడానికి చేసిన చర్యను ఆయన తీవ్రంగా ఖండించారు.

పిటిసి కరీంనగర్

TSPSC

రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ – TSPSC – గ్రూప్ 1 ప్రీలిమినరి పరీక్షను OMR ఆఫ్ లైన్ విధానంలో నిర్వహించాలని నిర్ణయించినట్టు ప్రకటించింది. ఈ గ్రూప్ – 1 ప్రిలిమినరీ పరీక్ష జూన్ 9వ తేదీన జరగనుంది.

PN

CONGRESS

కేంద్ర హోంమంత్రి అమిత్ షా పై మార్ఫింగ్ వీడియో కేసుకు సంబంధించి కొనసాగుతున్న దర్యాప్తులో భాగంగా ఢిల్లీ పోలీసుల ప్రత్యేక బృందం ఈరోజు హైదరాద్ లోని కాంగ్రెస్ పార్టీ కేంద్ర కార్యాలయం గాంధీభవన్ కు చేరుకుంది. ఆ బృందం స్థానిక పోలీసులను కలుసుకొని, ఇటీవల ఈ కేసుకు సంబంధించి నోటీసులు అందుకున్న పలువురు నాయకుల గురించి వివరాలు అడిగి తెలుసుకుంది. ఇదిలా ఉండగా, నోటీసులు అందుకున్న వారి నుంచి సామాజిక మాద్యమాలైన ఎక్స్, మెటా నుంచి ఎటువంటి స్పందన రాలేదని ఢిల్లీ పోలీసుల బృంద వర్గాలు తెలిపాయి. ఈ ఫేక్ వీడియోలను షేర్ చేస్తున్న ముగ్గురిలో ఇద్దరిని గుజరాత్ లోను, ఒకరిని అస్సాంలోను అరెస్టు చేశారు. అయితే ఒరిజినల్ మార్ఫింగ్ వీడియోను రూపొందించిన వారిని పట్టుకునేందుకు ప్రయత్నిస్తున్నామని ఢిల్లీ సీనియర్ పోలీస్ అధికారి ఒకరు తెలిపారు.

DESK

MODI

రాష్ట్రంలో లోక్ సభ ఎన్నికలు ఈనెల 13వ తేదీన జరగనున్న నేపథ్యంలో ప్రధానమంత్రి నరేంద్ర మోది ఈనెల 8, 9, 10 తేదీల్లో ముమ్మరంగా ఎన్నికల ప్రచారంలో పాల్గొంటారు. 8వ తేదీన రాజన్న సిరిసిల్ల జిల్లాలోని వేములవాడలో బహిరంగ సభలో ప్రసంగిస్తారు. తర్వాత వరంగల్ జిల్లాలోని మడికొండలో బహిరంగ సభలో పాల్గొంటారు. పదవ తేదీన మహబూబ్ నగర్ లోక్ సభ నియోజకవర్గంలోని నారాయణ్ పేట్ లో మరొక బహిరంగ సభలో పాల్గొంటారు. అనంతరం హైదరాబాదులోని ఎల్.బి.స్టేడియంలో బహిరంగ సభలో ప్రజలను ఉద్దేశించి ప్రసంగిస్తారు. తెలంగాణ రాష్ట్రంలో ఎక్కువ లోక్ సభ స్థానాలను గెలవడం కోసం భారతీయ జనతా పార్టీ కృషి చేస్తుండటంతో పార్టీ ప్రముఖులు ఓటర్లను ఆకట్టుకునేందుకు అన్ని ప్రయత్నాలు చేస్తున్నారు.

DESK

వనపర్తి – రేవంత్ రెడ్డి

ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి వనపర్తి జిల్లాలో ఈ నెల 4వ తేదీన జరపనున్న పర్యటన సందర్భంగా ఏర్పాట్లు పక్కడ్బందీగా నిర్వహించాలని జిల్లా ఎస్పీ రక్షితా కే మూర్తి పోలీసు అధికారులను ఆదేశించారు. ఈరోజు వనపర్తి జిల్లా కొత్తకోట మండల కేంద్రం, కనాయ పల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్ ను, సభా ప్రాంగణాన్ని, విఐపి పార్కింగ్ ప్రదేశాలను ఎస్పీ పరిశీలించారు.

పిటిసి వనపర్తి

WEATHER

రాష్ట్రంలో ప్రస్తుతం నెలకొన్న వేడి పరిస్థితులు మరో నాలుగు రోజులు కొనసాగుతాయని వాతావరణ శాఖ ఒక ప్రకటనలో తెలియజేసింది. ఈ మేరకు కరీంనగర్, పెద్దపల్లి, జయశంకర్ భూపాల్ పల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, మహబూబ్ నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట్, జోగులాంబ గద్వాల జిల్లాలలో కొన్ని ప్రాంతాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది. కాగా, రాష్ట్రంలో నిన్న 11 ప్రాంతాల్లో 46 డిగ్రీల సెల్సియస్ ను మించి అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

PN

ఎనౌన్స్ మెంట్

రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో  భద్రతా  ఏర్పాట్లపై తెలంగాణ రాష్ట్ర పోలీస్ డైరెక్టర్ జనరల్ రవి గుప్తాతో ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం జరిపిన ముఖాముఖి కార్యక్రమం ఈ రాత్రి 7 గంటల 45 నిముషాలకు ప్రసారమవుతుంది. ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం, ప్రాంతీయ వార్తా విభాగం ప్రసారం చేస్తున్న ఈ కార్యక్రమాన్ని ఆకాశవాణి అన్ని కేంద్రాల్లోను వినవచ్చు.

ఎన్ఫోర్స్ మెంట్ :

హైదరాబాద్ జిల్లాలో వివిధ ఎన్ఫోర్స్ మెంట్ బృందాల ద్వారా ఇప్పటి వరకు 21 కోట్ల 61 లక్షల 05 వేల 505 రూపాయల నగదుతో పాటు, 13 కోట్ల 82 లక్షల 63 వేల 903 రూపాయల విలువ గల ఇతర వస్తువులు, 26 వేల 474 లీటర్ల అక్రమ మద్యాన్ని పట్టుకున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి, జిహెచ్ఎంసి కమిషనర్ రోనాల్డ్ రోస్ తెలిపారు. 266 మందిపై కేసులు నమోదు చేసి 262 మందిని అరెస్ట్ చేసినట్లు తెలిపారు. (పిటిసి హైదరాబాద్)